గృహలక్ష్మిపైనే ఆశలు

- మండల వ్యాప్తంగా 5,237 దరఖాస్తులు
- నేటి నుంచి ఇంటింటా సర్వే
- ఈనెల 20వరకు పూర్తికానున్న లబ్ధిదారుల గుర్తింపు



బేల మీసేవ వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు (ఫైల్)

బేల: సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుందామని ఆశతో ఎదురుచూస్తున్న అర్హులకు గృహలక్ష్మి పథకం అందేనా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 8, 9, 10 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించారు. దీంతో వేల సంఖ్యలో దరఖాస్తులు రాగా.. లబ్ధిదారులుగా ఎవరూ ఎంపిక అవుతారని గంపెడు ఆశతో నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. అధికార పార్టీ నాయకులు సిఫారసు చేసి వారినే ఎంపిక చేస్తారని, నిరుపేదలకు ఏమాత్రం దక్కే అవకాశం ఉండదని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఈ పథకం కింద మండలం మొత్తంగా 5,237 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గంలో ఏ మండలానికి ఎంత కేటాయిస్తారో వేచిచూడాల్సిందే మరి.

భారీగా దరఖాస్తులు..

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు స్వీకరించగా.. మండల మొత్తంగా 5,257 దరఖాస్తులు వచ్చాయి. మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా.. అత్యధికంగా బేల గ్రామ పంచాయతీ పరిధిలో 538 దరఖాస్తులు వచ్చాయి. సైద్‌పూర్‌లో 269, చప్రాలలో 264, దహెగాంలో 263, సదల్‌పూర్‌లో 246, కొగ్దూర్‌తో పాటు బెదోడలో 200 దరఖాస్తులు వచ్చాయి. మిగతా గ్రామ పంచాయతీల్లో తక్కువ దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా పొహర్ గ్రామ పంచాయతీ పరిధిలో కేవలం 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

క్షేత్రస్థాయిలో సర్వే..

దరఖాస్తులను ఈనెల 10న ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. ఈనెల 11న ఎంపీడీవో గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక చేసే విధానంపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. దరఖాస్తుల ఆధారంగా సోమవారం నుంచి ఇంటింటికీ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో వెళ్లి సర్వే చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితా ఆధారంగా దరఖాస్తుదారులను అనర్హులుగా గుర్తించనున్నారు. స్లాబ్ ఇల్లు ఉంటే సైతం అనర్హులుగా పరిగణిస్తారు. ధనవంతులకు అవకాశం ఇవ్వరు. కేవలం రేకులు, గూన ఇల్లు వారినే అర్హులుగా గుర్తించి, జాబితాలో పేర్లను నమోదు చేసుకుంటారు. దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ ప్రకారం కేటాయించనున్నారు. పంచాయతీ కార్యదర్శులు పరిశీలించిన క్రమంలోనే మండల పంచాయతీ అధికారి, ఎంపీడీవో, ఇతర అధికారులు ర్యాండమ్ సిస్టంలో పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితాను సిద్ధం చేస్తారు. ఇదంతా ఈనెల 20 వరకు పూర్తి చేయనున్నారు. 25న కలెక్టర్ నుంచి అర్హులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తారు.

పకడ్బందీగా అర్హుల గుర్తింపు



ప్రతీ గ్రామంలో దరఖాస్తుదారుల జాబితా ఆధారంగా పకడ్బందీగా అర్హులను గుర్తిస్తాం. కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొందిన వారిని, స్లాబ్ ఇల్లు ఉన్నవారిని అనర్హులుగా గుర్తించడం జరుగుతుంది. ప్రస్తుతం రేకులు, గూన ఇల్లు వారినే అర్హులుగా గుర్తిస్తాం. జాబితాలో అనర్హులకు అవకాశం ఇవ్వం.

– మహేందర్‌కుమార్, ఎంపీడీవో బేల

క్లుప్తంగా

దాడి చేయడం సరికాదు

బేల: కొలాం సంఘం అధ్యక్షుడు కొడప సోనేరావుపై దాడి చేయడం సరికాదని మండల రాయిసెంటర్ అధ్యక్షుడు కొరంగే సోనేరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ తెగలలో ఏదైనా సమస్య వస్తే కలిసి పరిష్కరించుకోవాలని, ఇలా దాడి చేసుకోవడం హేయమైన చర్య అన్నారు. తుడుందెబ్బ నాయకులు సమాజాన్ని పక్కదారి పట్టించడం బాధకరమన్నారు. రాజకీయాలు పక్కకు పెట్టి ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఆదివాసీ నాయకులు మడావి సకరాం, కొడప జైవంత్, కొరంగే జంగ్‌షా, నందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

బోథ్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని బోథ్ సీఐ భీమేశ్, ఎస్సై రాములు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని కోరమాండల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అధిక లోడ్‌తో వాహనాలు వెళ్లరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు.

గుంతలు పూడ్చిన గ్రామస్తులు

నేరడిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుమారి, కుప్టి గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను గ్రామస్తులు, యువకులు పూడ్చేశారు. ఇన్ని రోజులుగా రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడగా అవి తొలగిపోయాయని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కాలనీలో కార్డన్ సెర్చ్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని 170 కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో మావల పోలీసులు ఆదివారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుమానిత ప్రాంతాల్లో, కాలనీలో తనిఖీలు చేపట్టడం జరిగిందని పోలీసులు తెలిపారు. సరైన పత్రాలు లేని 15 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: నాలుగు రోజుల క్రితం చాందా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ముజాహిద్ మానవ సేవే మాధవ సేవ, బెస్ట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు రిమ్స్ మార్చురీలో ఉన్న మృతదేహానికి తిర్పెల్లి శ్మశానవాటికలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో చౌహాన్ శశికళ, రాము, చిందం దేవిదాస్, నర్సింగ్, మారుతి, అబ్దుల్ అజీజ్, శ్రీనివాస్, పృథ్వీరాజ్, ప్రమోద్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల కోసం నూతన కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. 1985లో దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేశారని, ఆ తర్వాత ఇప్పటివరకు మళ్లీ కాలనీ ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ హంజ, శంకర్, సంతోష్, నగేశ్ పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేయాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సాకటి దశరథ్

తాంసి: బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ కోరారు. భీంపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాకేశ్ యాదవ్, దేవారెడ్డి, రామారావు, అశోక్, ప్రవీణ్ రెడ్డి, సంజీవ్, వెంకటేశ్, అరుణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బేల: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సాంగ్వి(జి), పాతగూడ, సాంగ్వి(కె), జామ్డ గ్రామాల్లో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. సాంగ్వి(కె)లో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే జోగు రామన్న నిర్లక్ష్యంతో నియోకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. అనేక పథకాల్లో ఎమ్మెల్యే కమీషన్లు దండుకుని వేల కోట్ల ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జోగు రామన్నను చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, గిమ్మ సంతోష్, రాజ్‌మహ్మద్, మడావి చంద్రకాంత్, కొందూరి రవి, అల్లూరి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

‘నాసిరకంగా వంతెన నిర్మాణం’



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

నేరడిగొండ: మండల కేంద్రం నుంచి కుంటాల జలపాతం వరకు వెళ్లే మార్గంలో సావర్గాం వద్ద వంతెనను నాసిరకంగా నిర్మించారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్‌సింగ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్ ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలిసి వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుంటాల జలపాతానికి అధికంగా పర్యటకులు వస్తారని, అయితే అభివృద్ధికి ఏ మాత్రం నోచుకోలేదన్నారు. నాసిరకంగా వంతెన నిర్మించడంతో కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు సేల్కే సాయి ప్రసాద్, సుందర్ సింగ్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ యూత్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాగాపూర్‌లో ఆదివాసీ యూత్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మర్సుకొల అశోక్, అధ్యక్షుడిగా నైతం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కుడిమత లవన్, సహాయ ప్రధాన కార్యదర్శిగా తొడసం గణేష్, ప్రచార కార్యదర్శిగా చక్కటి సూర్యవంశీ, కోశాధికారిగా చాకటి వంశీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ మర్సుకొల హనుమంతరావు, దేవరీ కుడిమెత గంగారాం, ఐటీడీఏ డైరెక్టర్ మర్సుకోల బాపురావు, సోయం లలిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీసెల్ మండలాధ్యక్షుడిగా గంగాధర్

సిరికొండ: కాంగ్రెస్ ఆదివాసీ ఎస్టీసెల్ మండలాధ్యక్షుడిగా మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన రాథోడ్ గంగాధర్ ఆదివారం హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ నియమించారు. గంగాధర్ మాట్లాడుతూ.. పార్టీ నాపై నమ్మకంతో పదవి ఇచ్చిందని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

అన్నాభావుసాఠే గ్రామ కమిటీ ఎన్నిక

బజార్‌హత్నూర్: అన్నాభావుసాఠే జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు బాట్లాడే సూర్యకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బోస్రా గ్రామంలో ఎస్సీ మాతంగ్ కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోట్ముకులే ఆకాశ్, ఉపాధ్యక్షుడిగా కాంబ్లే సంతోష్, ప్రధాన కార్యదర్శిగా వాగ్మరే శంకర్, సంయుక్త కార్యదర్శిగా గోట్ముకులే సుభాష్, కోశాధికారిగా తాత్రే ఆకాష్, సభ్యులుగా గోట్ముకులే శ్రీరాం, కాంబ్లే రమేశ్, జ్ఞానేశ్వర్, రాజు, శేషేరావ్, సాయి చరణ్, కందు, సిద్దార్థ, శంకర్, ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే టీపీయూఎస్ మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపికృష్ణలు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు నారాయణ, గంగాధర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన ఇట్టెడి శ్రావణ్ రెడ్డి నానమ్మ నర్సమ్మ ఇటీవల మృతి చెందగా.. బోథ్ మండల కేంద్రానికి చెందిన ఆరె విఠల్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. వారి కుటుంబసభ్యులను బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ ఆదివారం పరామర్శించారు.

- పాచ్పెర గ్రామంలో పిడుగు గంగాధర్ మాతృమూర్తి చిన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన శబరిమాత భక్తురాలు అంబకంటి కళ మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమారి గ్రామానికి చెందిన గొండ్ల కిష్టయ్య, అలకంటి రాజేశ్వర్ మృతి చెందగా కుటుంబీకులను పరామర్శించారు.

సంక్షేమ పథకాలు వివరించాలి

తలమడుగు: బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మండల కన్వీనర్ వెంకటేశ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ప్రకాశ్, సునీతరెడ్డి, సంతోష్, చంటి, నారాయణ, రాకేశ్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఎన్నికలకు సహకరించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 27న జరగనున్న ఆదిలాబాద్ పట్టణ ముదిరాజ్ సంఘం ఎన్నికలకు కులపెద్దలు, సభ్యులు సహకరించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్నికల నిర్వహణ కన్వీనర్ భొజ్జ నారాయణ, జిల్లా అధ్యక్షుడు శివయ్య కోరారు. ఆదివారం శ్రీరామ కాలనీలోని సంఘ భవనంలో ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు గంగాధర్, భొజ్జ పోచన్న, పిట్ల లచ్చన్న, బొమ్మెన లస్మన్న, నర్సింగ్, ఓరుగంటి శ్రీనివాస్, ఇండ్ల భూమన్న, షేర్ల సుధీర్, రాజు, ఓరుగంటి రఘు, సన్నీ పాల్గొన్నారు.

బీజేపీ శక్తి కేంద్రాల కార్నర్ సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బట్టిసావర్గాంలో ఆదివారం బీజేపీ శక్తి కేంద్రాల కార్నర్ సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ స్థాయి ఫుల్ టైమర్ వంశీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోరంచు గంగారెడ్డి, రవి రెడ్డిలు హాజరై మాట్లాడారు. మరింత కష్టపడుతూ శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి భూమేశ్, మండల ప్రధాన కార్యదర్శి సంతోష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్

ఉట్నూర్‌రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగా అభియాన్ నిర్వహించారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మండల కేంద్రంలో జాతీయ జెండాలను వ్యాపారస్తులకు, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, శ్రీరామ్‌నాయక్, కొండేరి రమేశ్, ఆడే ధన్‌లాల్, గంగన్న, లింగాగౌడ్, శ్రీధర్, గాలి శ్రీకాంత్, బొడ్డు కిరణ్, రవి, నాగభూషణం, సంతోశ్ రెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం



కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు

తాంసి: మండలంలోని సావర్గాం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామంలోని ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసింది. గత ఆరు నెలల క్రితం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సర్పంచ్ మునేశ్వర్ భారత్ నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాడు. దాదాపుగా 50 శాతం పనులు పూర్తయ్యాయి.

‘ఆదివాసీలతో రాజకీయం చేయడం మానుకోవాలి’



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇచ్చోడ: తుడుందెబ్బను అడ్డం పెట్టుకొని ఆదివాసీలతో రాజకీయం చేయడం మానుకోవాలని వైస్ ఎంపీపీ, తుడుందెబ్బ జిల్లా మాజీ అధ్యక్షుడు కొడప జల్జెజాకు, సార్మెడిలు భీంరావు, గంగారాంలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ఆదివాసీలను విడగొట్టేలా తుడుందెబ్బ జిల్లా కమిటీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. సోయం బాపురావు నాయకత్వంలో చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ప్రధానమంత్రి, గిరిజనశాఖ మంత్రి, న్యాయశాఖ మంత్రులకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. అయితే ఈవిషయాన్ని జీర్ణించుకోలేని గోడం గణేశ్, ఖుర్సు పోచయ్య, గోడం రేణుక, పుర్క బాపురావు, కుమ్రం జంగు ఆదివాసీ నాయకులు ఉద్యమాన్ని, ఆదివాసీ తెగల మధ్య చిచ్చు పెట్టుతున్నారని మండిపడ్డారు. కొడప సోనేరావుపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, ఏమైనా సమస్యలుంటే రాయిసెంటర్లను ఆశ్రయించాలే తప్పా రోడ్లపై రాజకీయం చేయవద్దన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సిడం చందు, మాజీ సర్పంచ్ పెందుర్ రామారావు, పటేల్ చిత్రు, మడావి జంగు పటేల్, కొడప రమేశ్, అనక సీతారాం, ఆత్రం యాదోరావు, చాహకటి బాపురావు, గోడం సురేశ్, కొడప ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పబ్బం గడిపేందుకే విమర్శలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిపక్ష నాయకులు రాజకీయ పబ్బం గడిపేందుకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మండిపడ్డారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, అష్రఫ్, అంజుబాయి, తదితరులు పాల్గొన్నారు.

కార్యాచరణ రూపొందించుకోవడం అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్: ఐకమత్యంగా ఉంటూ ఆర్థిక ప్రగతి సాధించాలని కార్యాచరణ రూపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పటేల్ ఎంటర్‌ప్రైజర్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరుకాపు కులస్తులు నడుపుతున్న వ్యాపారాలు, ఒకరికొకరు సాయం చేసుకుంటూ.. ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, ప్రముఖ వైద్యులు అభిజిత్, సాయిని రవికుమార్, జక్కుల సత్యనారాయణ, బేర సతీష్, జక్కుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ శ్యామ్ మోహన్ రావు

బోథ్: గత సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులకు వినాయక్ రావు మెమోరియల్ ట్రస్టు సభ్యులు ఆదివారం ప్రగతి పాఠశాలలో స్కాలర్‌షిప్‌లు అందజేశారు. జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన మల్కోటి శృతికి రూ. 10 వేలు, జెడ్పీఎస్ఎస్ సొనాలకు చెందిన వడ్డె మంగళకు రూ. 9 వేలు, జెడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలకు చెందిన ఓంనాథ్‌కు రూ. 6 వేలు, జెడ్పీఎస్ఎస్ మర్లపెల్లికి చెందిన రాథోడ్ దుర్గాబాయికి రూ. 6 వేలు, జెడ్పీఎస్ఎస్ ధన్నూర్‌కు చెందిన సోమన్‌పెల్లి శృతికి రూ. 6 వేలు, జెడ్పీఎస్ఎస్ పొచ్చెరకు చెందిన తుక్కిరెడ్డి సింధుజకు రూ.6 వేలు, జెడ్పీఎస్ఎస్ కనుగుట్టకు చెందిన బీరం స్పందనకు రూ. 6 వేల స్కాలర్‌షిప్ అందించారు. కార్యక్రమంలో అంబదాస్, సర్పంచ్ గొర్ల సురేందర్, వీడీసీ చైర్మన్ గంగాధర్, నందయ్య, హరీశ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బేలలో 33కేవీ లైన్ నిర్మాణ పనుల కారణంగా ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్, కైలాస్‌నగర్, దస్నాపూర్‌లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా జైనథ్ సబ్ స్టేషన్ పరిధిలోని భోరజ్, పెండల్‌వాడ, దీపాయిగూడ, ఆనంద్‌పూర్, బేల, సాంగిడి, చప్రాల గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: బేల 33కేవీ ఫీడర్ నిర్మాణ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి, సాత్నాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం



పార్టీ కండువా కప్పుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బేల మండలం సైద్‌పూర్ గ్రామస్తులు ఆదివారం పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీల నిధుల కేటాయింపులలో కోత విధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల సమయంలోనే సంక్షేమ పథకాల పేరిట హడావిడి చేస్తుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి, మయూర్ చంద్ర, ఆకుల ప్రవీణ్, రఘుపతి, శివ, సాయి, నరేశ్, ముకుంధ్ రావు, సురేశ్ పాల్గొన్నారు.

బాల కవి నితీశ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న సాహితీ వేదిక సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాల కవి నితీశ్ కుమార్‌కు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో ఉట్నూర్ సాహితీ వేదిక అధ్యక్షుడు కవన కోకిల జాదవ్ బంకట్‌లాల్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం సామాజిక స్పృహ కలిగిన బాలలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. నితీశ్‌కుమార్ రాసిన కవిత్వాన్ని పఠనం చేశారు. కార్యక్రమంలో మెస్రం మనోహర్, కట్ట లక్ష్మణాచారి, శ్రావణ్ రాథోడ్, ముంజం జ్ఞానేశ్వర్, ధరంసింగ్, మోతీరాం, వినోద్‌కుమార్, గంగాసాగర్ పాల్గొన్నారు.